# దేవుడు కనిపించాడు

కండ్లకుంట శరత్‌చంద్ర




టక్ టక్... తలుపు బాదుడుకు లేచి కూర్చున్నాడు మేనకేశ్వర్రావ్.

అతనికన్నా ముందుగానే లేచిన, అతని భార్య శకుంతల తలుపు తెరిచింది. పాలవాడొచ్చాడు. ఆవలిస్తూ సొట్టలు పడిన స్టీలుగిన్నెను అతని ముందు చాపింది. ఆమె వైపు జాలిగా చూస్తూ, పావు లీటరు పాలు గిన్నెలో పోసి వెళ్ళిపోయాడు. ఆమె, పాలలో వేలు ముంచి బయటకు తీసి చూసింది. నీళ్ళేతప్ప పాల జాడ ఏదీ కనిపించలేదు. ఇవే పాలు ముగ్గురు పిల్లలు, తను, భర్త, ఓ పూట టీ తాగడానికి, ఓ పూట మజ్జిగకు కావాలి.

పాలు వంటింట్లోనికి తీసుకెళ్ళి, ఓ పెద్ద గ్లాసెడు నీళ్ళు అందులో పోసి మూతపెట్టింది.

"ఛీ...ఛీ... వెధవ బ్రతుకు. ఎప్పుడూ ఇంతే...!" అనుకుంటూ ముగ్గు వేయటానికి వెళ్ళింది.

"కూరగాయలమ్మో!" అరుస్తూ, ఆమె ముందొచ్చి ఆగింది కూరలమ్మి.

"ఈ రోజు చవగ్గా ఏమున్నాయి?" రోజూ అడిగే ప్రశ్నే అడిగింది.

"బెండకాయలమ్మో! ఐదు రూపాయలకు పావు కిలో!" అంది కూరలమ్మి.

"ఏడ్చినట్లే ఉంది నా బ్రతుకు. అవొద్దుగానీ ఓ అర్ధ రూపాయికి పాలకూర ఇవ్వు!"

కూరలమ్మి, రెండు పాలకూర కట్టలిచ్చి అర్ధరూపాయి పుచ్చుకుని వెళ్ళిపోయింది.

శకుంతల విసుక్కుంటూనే వెళ్ళి పిల్లలిద్దరినీ నిద్ర లేపింది. పెద్ద పిల్లాడు ఇంటర్ చదువుతున్నాడు. అప్పటికే అతడు లేచి

జాగింగ్‌కు వెళ్ళాడు. మిగిలిన ఇద్దరు పిల్లలూ కవలలు, ఆడ సంతానం. ఇద్దరూ తొమ్మిదవ తరగతి చదువుతున్నారు.

"శకుంతలమ్మా! ఉన్నావా?" వినిపించింది ఇంటావిడ కంఠం. "ఉన్నానమ్మా! నేనెక్కడికి పోతాను. ఇక్కడే ఛస్తాను" అంటూ అద్దె తీసుకొచ్చి ఆవిడ చేతిలో ఉంచింది.

డబ్బు లెక్కపెడుతూ "ఇదిగో శకుంతలమ్మా! వచ్చే నెల నుండీ అద్దె మరో ముప్పై రూపాయలు పెంచుతున్నాను" చావుకబురు చల్లగా చెప్పి, వెళ్ళిపోయిందావిడ.

"ముప్పై రూపాయలే! ఒక నెల రోజులు కూరగాయలు కొంటాను నేనైతే. దీనికిదేం పోయే కాలం? అద్దె ఇప్పుడే పెంచి చావాలా? ఇల్లు మార్చి వేరే చిన్న గూడు వెతుక్కోవాలి." అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది. అననైతే అందిగానీ, ఇల్లు మార్చి, వేరే ఇల్లు వెతుక్కోవాలంటే మాటలా? పిల్లలు మౌనంగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు మేనకేశ్వరరావ్. తన భార్య ఈ రోజు ఎందుకింతగా విసుక్కుంటుందో అతనికి తెలుసు. మూడు నెలల నుండీ బోనస్ ఇస్తానని చెబుతూ, ఇవ్వకుండా ఎగబెడుతున్న తన బాస్ నిన్న ఒకటో తారీఖున కూడా మొండిచెయ్యి చూపాడు. తనకు వచ్చే బోనస్ మూడొందలే అయినప్పటికీ వాటి కోసం శకుంతల ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తోంది. నిన్న అది రాకపోయేసరికి, ఎప్పటిలాగే ఒళ్ళు మండి, నిన్న రాత్రి వంటే చేయలేదసలు.

బోనస్ ఇవ్వకపోవటం బాస్ తప్పు కదా! అక్కడికేదో తన తప్పయినట్లు ఇంటిల్లిపాదికీ కడుపు మాడిస్తే ఎలా? తనకు భార్యపై నోరెత్తే ధైర్యం లేదు. రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. చిన్నా చితకా చేబదుళ్ళిచ్చేవాళ్ళు, అప్పులవాళ్ళు స్వప్న సుందరులై తిరుగుతూ తనను నిద్రపోనివ్వడం లేదు.

గోడకు చూస్తే, తన చిరుగుల చొక్కా వెకిలిగా నవ్వుతోంది. ఆగిపోయిన పాత గడియారం 'ముళ్ళు' కసిగా తనను పొడవాలని చూస్తున్నాయి. ఇంట్లోని కరెంటు మీటర్ మాత్రం పరుగుల రాణి పి.టి. ఉషలా పరుగెత్తుతోంది. బయట భిక్షగాడి కేక!

"మేమే ఓ రకం భిక్షగాళ్ళం! మా ఇంటికెందుకు వస్తావ్? నీ జోలెలో ఏమైనా అన్నం, కూరలు ఉంటే మా పళ్ళెంలో వేసెళ్ళు. నీకు పుణ్యమొస్తుంది" అని ప్రత్యక్షంగా భిక్షగాడ్నీ, పరోక్షంగా తననూ గేలిచేస్తున్న తన కూతురి మాటలు, ఆపై భిక్షగాడి తిట్లు, ఇలా తన మెదడును కుమ్మరి పురుగులా తొలుస్తున్నాయి.

### నాలో హంపీ

ఏది హంపీ
దేశభాషల తెలుగు లెస్సను
నాటి నానుడి...?

ఏది హంపీ
అష్ట దిగ్గజయాన మరసిన
మేర చావడి!

ఏది హంపీ
కడిమి పూచిన కళల పూవుల
కమ్మ తెమ్మెర!

ఏది హంపీ
కొనలు సాగిన కొదరు పాటల
జాలు క్రొమ్మెర!

ఎచట హంపీ
తెగువ ఊపిరి తొంగలించిన
కొండగాలులు!

ఎచట హంపీ
కత్తి మొనలో కదను త్రొక్కిన
గుండె వాలులు!

ఏవి హంపీ
అంచెలంచెల బారులల్లిన
కోట మోచులు?

ఏవి హంపీ
నుర్వు కెరటాల్ నెనడులెత్తిన
దంతరోచులు?

\- సాంధ్యశ్రీ

'నాకు డబ్బు కావాలి'. డబ్బు... డబ్బు... తనో పెద్ద ఇల్లు కొనుక్కోవాలి. తన భార్యకు మంచి చీరలు, నగలు కావాలి. తన బాస్ తన దగ్గర అటెండర్ పని చెయ్యాలి. రోజుకు వంద రూపాయల కూరగాయలు వండాలి. ఇలాంటి భిక్షగాళ్ళకు, రోజుకో పది మందిని చొప్పున పిలిచి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టాలి. తను సూట్ వేసుకుని ఏ.సి. కార్లలో తిరగాలి.

ఫోమ్‌బెడ్‌పై, ఏ.సి. గదిలో పడుకుని, కూల్ డ్రింగ్ త్రాగుతూ వి.సి.డి.లో సినిమాలు చూడాలి. ఎలా? డబ్బు కావాలి... "త్వరగా లేచి కార్యక్రమాలు కానివ్వండి..." భార్య గాండ్రింపుకు కలలన్నీ చెల్లా చెదురై దూరంగా పారిపోసాగాయి. స్నానం చేసొచ్చి, దేవుడి ముందు నిల్చున్నాడు. రోజూ కళ్ళు మూసుకుని ఐదు నిమిషాలు రామా... కృష్ణా ... అనుకుని వెళ్ళడం, ఆ ఇంట్లో అందరికీ అలవాటు. ఈ రోజు అతను కళ్ళు మూసుకోలేదు. దేవుడి గూట్లో పటాల వంక చూడసాగాడు.

రాముడు, శంకరుడు, కృష్ణ-కుచేలుల పటం, సత్యనారాయణ స్వామి పటం ఉన్నాయి. తనకు దైవభక్తి చాలా ఎక్కువ. దేవుడంటే విపరీతమైన నమ్మకం. పురాణాలు, హరికథలు బాగా వినేవాడు. దేవుడి సినిమా వస్తే మాత్రం చివరి రోజైనా వీలు చూసుకుని వెళ్ళి తీరుతాడు.

"శ్రీకృష్ణుడు, కుచేలుడికి ఎంత సంపదనిచ్చాడో..." అనుకుంటూ వెనుదిగిరి వచ్చి హాల్‌లో కూర్చున్నాడు. ఏవేవో ఆలోచనలు మనసుతో ఆడుకుంటున్నాయి.

"లాటరీలు, గుర్రప్పందేలు లాంటివి తన లాంటి మధ్యతరగతి వాడికి తగవు. తన లాంటి దురదృష్టవంతుడికి అసలు అవి అచ్చిరావు. ఢబ్బెలా సంపాదించాలి? ఎలా... ఎలా?

ఏ దేవుడో ప్రత్యక్షమై వరాలిస్తే బావుండును. కోరికల లిస్టు టక... టక వినిపించేవాడ్ని. అమ్మో! ఆ వచ్చిన దేవుడు తన కోరికల జాబితా చూసి భయపడి పారిపోతాడేమో... తెలివిగా కోరాలి. ఒక అక్షయపాత్రను ప్రసాదించమని, అది, ఏదడిగినా అనుగ్రహించేట్లుండాలని కోరాలి" అనుకున్నాడు.

"దేవుడు ఊరికే ప్ర్యక్షమవుతాడా? అవ్వడు కాక అవ్వడు. ఆఁ... తపస్సు చేస్తే సరి... భక్త ప్రహ్లాదలో హిరణ్య కశిపుడికి బ్రహ్మ ప్రత్యక్షమైనాడు కదా! ధ్రువుడికి విష్ణువు ప్రత్యక్షమైనాడు గదా! గజేంద్రుడి కోసం విష్ణువు, లక్ష్మినీ, శంకు చక్రాదులనూ కేర్ చెయ్యకుండా ఆత్రంగా పరుగెత్తుకొచ్చాడట. సరే! తపస్సు చేసి తీరతాను. భగవంతుని ప్రత్యక్షం చేసుకుంటాను. వరం అడుగుతాను" అనుకుని లేచాడు.

"తపస్సు ఎక్కడ చెయ్యాలి? ఇంట్లో అయితే అస్సలు కుదరదు. పెళ్ళాం తన్నినా తంతుంది. పిల్ల పిశాచాలు ప్రశాంతంగా చేసుకోనిస్తారా? అసలు తన భార్యను చూస్తే దేవుడికి భయమేసి రాడేమోననిపించింది. తపస్సు ఇంట్లో కుదరదు. అయినా తపస్సు చేసేవాళ్ళెవరూ ఇంట్లో చెయ్యరు. హిమాలయాలలోనూ, దట్టమైన అడవుల్లోనూ చేస్తారు. హిమాలయాలకు వెళ్ళడమంటే మాటలా? తన జీతం కూడా సరిపోదు. దట్టమైన నల్లమల అడవులుండగా వేరే చోటికి వెళ్ళాల్సిన పనేముంది? సరే... తపస్సు చేస్తాను" అని బయల్దేరాడు మేనకేశ్వరరావు.

* * *

తపస్సు గురించి శ్రీశైలం వెళ్ళే బస్‌లో కూర్చుని ఆలోచించసాగాడు. తపస్సంటే మాటలు కాదు. దేవుడు రావడానికి రెండు రోజులు పట్టొచ్చు, మూడు రోజులు పట్టొచ్చు అనుకుని చిన్నప్పుడెప్పుడో చచ్చిపోయిన తన తాతయ్యను రెండోసారి చంపి, దాని పేరిట వారం లీవ్ అప్లయ్ చేశాడు. ఆఫీసు పనిమీద

టూర్‌కెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. అడవుల్లో పులులూ, ఎలుగుబంట్లూ ఉంటాయి. అవి, వెలుగు చూస్తే పారిపోతాయని ఎప్పుడో ఎవరో చెప్పిన విషయాన్ని దృష్టిలో వుంచుకుని ఓ అగ్గిపెట్టె తెచ్చుకున్నాడు. తన మిత్రుడూ, డ్రామా ఆర్టిస్టూ అయిన రామకృష్ణ దగ్గర మునుల దుస్తులు, గడ్డం దండకమండలాలు తీసుకొచ్చాడు.

అచ్చంపేట దాటాక, దట్టమైన అడవి ప్రారంభమైంది. మధ్యలో ఒక చోట బస్ ఆపించుకుని దిగాడు. సమయం, ఉదయం ఎనిమిదయ్యింది. గబగబా అడవిలోకి నడవసాగాడు. అడవిలో మద్ది, టేకు, మఱ్ఱిచెట్లు, గుబురు గుబురుగా పెరిగిన పొదలూ దర్శనమిచ్చాయి. రకరకాల పక్షుల కూతలతో అడవి ప్రతిధ్వనిస్తోంది. అయినా వాతావరణం ప్రశాంతంగా తోస్తోంది.

అతని కాళ్ళ ముందు నుండి ఓ రెండు కుందేళ్ళు పరుగెత్తాయి.

"బుస్..."మని ఏదో శబ్దం వినిపించింది. ఎండుటాకులపై ఏదో కదిలిన చప్పుడు. అటు తిరిగి చూశాడు. అయిదున్నర అడుగుల బ్లాక్ కోబ్రా! ఒంపులు తిరుగుతూ పొదల్లోనికి వెళ్ళింది. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది. హిరణ్యకశిపుడు తపస్సు చేసినపుడు, పుట్టలు పెరిగి అందులోంచి పాములు బయటికొచ్చాయట. నాకూ అంతేనా... అనుకుంటూ ముందుకు నడిచాడు.

ఓ విశాలమైన మఱ్రిచెట్టు కనిపించింది. తపస్సుకు ఇదే అనుకూలమైన ప్రదేశం...

'ఇంతకూ ఎవర్ని ధ్యానించాలి? రాముడు, కృష్ణుడు అంటే విష్ణువు కదా. చాలా మాయలు చేస్తాడు. వరాలు అంత ఈజీగా ఇవ్వడు. ఏదో ఫిట్టింగ్ పెడతాడు. ఒద్దు... బ్రహ్మ గురించి చేద్దామా? అమ్మో వేల సంవత్సరాల నుండీ ఆపకుండా విధి రాతను కొనసాగించేస్తున్న అతడు, మరిన్ని వేల సంవత్సరాల తర్వాత గానీ తలెత్తి చూడడు. వద్దు బాబోయ్...

శంకరుడైతే సరిపోతాడు. అదీగాక, నేనున్నది శ్రీశైల ప్రాంతం. భక్తులు ఎప్పుడెప్పుడు పిలుస్తారా... వెళ్ళి ఠకీమని వాళ్ళడిగిన వరాలన్నీ కుప్పించి పేరు కొట్టేయాలని కాచుకుని కూర్చుంటాడు. ఓ మూడు రోజుల ఓం నమశ్శివాయ అంటూ కూర్చుంటే సరిపోతుంది. ఖచ్చితంగా దిగి వస్తాడని నిర్ణయించుకుని ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

ఇంతలో, సూట్‌కేసు, దుస్తులు, ఛార్జీ డబ్బులూ బయటే ఉన్నాయన్న సంగతి గుర్తొచ్చింది. వెంటనే కళ్ళు తెరిచి, బట్టలు సూట్‌కేసులో ఉంచి, ఆ సూట్‌కేసును ప్రక్కనున్న పొదలో ఎండుటాకులతో కప్పెట్టి, వచ్చి కూర్చున్నాడు.

అయినా, నా తెలివితక్కువ తనం కాకపోతే ఇక్కడికి ఎవరొస్తారు అనుకుని, "దేవుడా ఇక్కడికెవరూ రాకుండా తపస్సుకు భంగం కలగకుండా చూసే బాధ్యత నీదే... నేను కళ్ళు తెరవగానే నువ్వే కనిపించాలి అని కళ్ళు మూసుకుని ఓ నమఃశివాయ... ఓం నమః శివాయ" అంటూ ధ్యానించసాగాడు. ఓ గంట గడిచింది.

"ఎవర్నువ్వు? కళ్ళు తెరువు" వినిపించిందో కంఠం యమా కరుకుగా. ఠకీమని కళ్ళు తెరుచుకున్నాయి. ఎదురుగా ఇద్దరు దొంగలు. చేతుల్లో తళతళా మెరిసే బాకులు పట్టుకుని నిల్చున్నారు.

"ఏయ్! ఏం చేస్తున్నావిక్కడ?"

"ఎ.... ఎవరూ... మీ... మీ....రు?"

"కనబడటం లేదా? గజదొంగలం!"

" 'గజ'దొంగలా? నల్లమల్ల అడవుల్లో గజాలు లేవుగా. మరి గజదొంగలెలా అవుతారు? ఓహో కుందేళ్ళ దొంగలా?" అన్నాడు సభాంగశ్లేషను ఉపయోగించి.

"ఏయ్! ఏంటి నీ పిచ్చి వాగుడు? నీ దగ్గరున్నదంతా ఇచ్చెయ్..."

"నా... నా.... నా దగ్గరేమున్నాయి? ఏ... ఏం లేవు. తపస్సు చేస్తున్నాన్నేను" అన్నాడు భయంగా.

"ఆ(... నీ నసుగుడు చూస్తేనే తెలుస్తోంది. నీ దగ్గరేదో ఉందని. మర్యాదగా తీస్తావా లేకపోతే..." కత్తి గొంతుమీద ఉంచాడు ఓ దొంగ.

## 'మన్మథరాసా...' చేస్తున్న హంగామా!



**బి**క్కుపలచని యువ హీరో 'ఏం చేస్తాడులే?' అనుకుంటూ అందరూ పెదవి విరిచారు. తీరా సినిమా రిలీజయిన తర్వాత జరుగుతున్న హంగామా చూస్తుంటే తీసిన వాళ్ళకే మతి చెడుతోంది! ఇదీ తమిళ కుర్రాడు (హీర్లో అనాలేమో) ధనుష్ నటించిన 'తిరుడా తిరుడి' ప్రస్తుత పరిస్థితి. ఆ పాట చూస్తుంటే తమిళ సినిమా హాళ్ళల్లో ఆడా, మగా అంతా సీట్లలోనే కూర్చోవడం లేదట! డిస్ట్రిబ్యూటర్లే రాక తంటాలు పడ్డ సినిమా కాస్తా 'మన్మథ రాసా...' అనే పాట మహిమతో టిక్కెట్లు దొరకని స్టేజీకి వెళ్ళిపోయిందట. ఒక్క పాట హీరో తల రాతే మార్చేసింది. అంతా రంగుల మహిమ!

## రాణీ! ఏమిటి సంగతి?



**ఖం**డాలా సుందరి రాణీముఖర్జి, బాలీవుడ్ హీరో అనిల్‌కపూర్ ఇటీవల హోటల్లో కలిశారట. అంతవరకూ బాగానే ఉంది! తరువాత జరిగిందే అంత బాగా అనిపించలేదట హోటల్‌వాళ్ళకి. రాత్రి పదకొండు గంటలకి ప్రారంభమైన వారి బాతాఖానీ తెల్లవారుఝాము వరకూ సాగిపోతూనే ఉందట. వారికి ఎప్పుడు ఏమి అవసరమవుతుందో, వాళ్ళు ఎప్పుడు ఏమి అడుగుతారో (???) అని అందివ్వడానికి సర్వర్‌లు పడిగాపులుకాయాల్సొచ్చిందట! వాళ్ళనుకున్నది ఏమీ లేకపోయినా, అంత ఇదిగా వాళ్ళు ఏమి మాట్లాడుకున్నారో మాత్రం తెలియలేదట పాపం!

"అయ్యా! గ... గజదొంగారూ... నా వెంట తెచ్చుకున్న సూట్‌కేసు అదిగో... ఆ పొదలో ఉంచాను. అది తీసుకుని నన్నొదిలేయండి. పిల్లలు గలవాడ్ని!" అని ఒణుకుతూ అన్నాడు.

"ఆహాఁ... పొదలో దాచావంటే... ఏదో ఉండే ఉంటుందందులో. పదరా!" అని ఇద్దరూ సూట్‌కేసు తీసుకుని వెళ్ళిపోయారు.

"ఇప్పుడెలా! ఈ దొంగ పీనుగులు, కత్తి చూపించి సూట్‌కేసు తీసుకెళ్ళారు. నా బట్టలూ, హైద్రాబాద్‌కు వెళ్ళేందుకు ఛార్జీ డబ్బులూ, అన్నీ అందులోనే ఉన్నాయే...!" ఏడుపు మొహం వేశాడు.

కాస్సేపయ్యాక తేరుకుని "ఆఁ... దాని గురించి వర్రీ అవసరం లేదు. దేవుడొస్తే వరాలిస్తాడు గదా! పనిలో పని హైద్రాబాద్‌కు చేర్చమంటే సరి!" సమస్యను తేలిగ్గా పరిష్కరించుకున్నవాడిలా మొహం పెట్టి మళ్ళీ ధ్యానం ఆరంభించాడు.

మిట్ట మధ్యాహ్నం! "ఏయ్ కళ్ళు తెరువు" వినిపించిందో కంఠం.

మేనకేశ్వరరావ్ కళ్ళు తెరవకుండానే "ఎవరూ? శంకరా! నువ్వేనా వచ్చావా?" అన్నాడు.

"ఔను శంకర్‌నే. క్యారెట్ల శంకర్‌ను. తెరువు కళ్ళు!" అన్నాడా వ్యక్తి.

మేనకేశ్వరరావ్ కళ్ళు తెరుచుకున్నాయి. చుట్టూ పది మంది విప్లవకారులు. నక్సలైట్ల దుస్తులలో, స్టెన్‌గన్‌లతో నిలబడి ఉన్నారు.

వాళ్ళను చూడగానే అతని పై ప్రాణాలు పైనే పోయాయి. కానీ విప్లవకారులంటే మంచి భావాలు కలవారనీ, దొంగలు కాదనీ, బానిస బ్రతుకుల్ని బాగు చేయటానికి పాలనా యంత్రాంగంలోని లోపాలను ఎత్తి చూపి సరిదిద్దేవారనీ చిన్నప్పుడు సాంఘిక శాస్త్రంలో "భారత స్వాతంత్ర్యంలో అతివాదుల పాత్ర!" అనే వ్యాసంలో చదివినట్లు గుర్తు.

"ఏంటలా గుడ్లు మిటకరించి చూస్తున్నావ్! దొంగసన్నాసి!" అన్నాడొకడు.

"నేను దొంగసన్నాసిని కాదు. తపస్సు చేసి, దేవుడ్ని రప్పించి, వరాలడుగుదామని వచ్చాను" అన్నాడు. ఆ మాటతో అందరూ ఘొల్లుమని నవ్వారు.

"ఆహా! అలాగా, మేం నమ్మాలన్న మాట!" ఎగతాళిగా అన్నాడింకొకడు.

"నువ్వు మా జట్టు నాయకుడి పేరు చెప్పావట... అదీ కేవలం గొంతు విని గుర్తుపట్టావంటే నువ్వు ఖచ్చితంగా పోలీసు అధికారివో, ఇన్‌ఫార్మర్‌వో అయ్యుంటావు. అవునా?"

"నేను మీ జట్టు నాయకుడి పేరు చెప్పమేంటి?" ఆశ్చర్యంగా అన్నాడు మేనకేశ్వరరావ్.

"శంకరా... వచ్చావా అన్నావు గదా...!"

"అయ్యా! నేను పరమశివుడొచ్చాడేమో ననుకుని 'శంకరా!' అని సంభోధించాను. మీ నాయకుడి పేరు శంకర్ అని నాకెలా తెలుస్తుంది?"

"అన్నీ దొంగమాటలు. మర్యాదగా చెప్పు. నువ్వెవరో. లేకపోతే ఎడాపెడా వాయిస్తాం. కాళ్ళూ చేతులూ విరిచి పొయ్యి రాజేసి వంటచెరుకుగా చేసుకుంటాం. చెప్పు!" శంకర్ గర్జించాడు.

"నాయనా! నన్నొదిలెయ్యండి బాబూ! నేను ప్రశాంతంగా తపస్సు చేద్దామని వస్తే ఇలా వేధించడం బాగోలేదు. పరమశివుడు, మూడోకన్ను తెరుస్తాడు".

"అన్నా! వీడు ఏదో కోడ్ భాషలో మాట్లాడుతున్నాడు. నాకైతే అర్థం కావడంలేదు. ఈ చుట్టుప్రక్కన ఎవరైనా పోలీసుల్ని కాపలా ఉంచాడేమో వెతకండి" ఆజ్ఞాపించాడు శంకర్.

అందరూ కలిసి, చుట్టూ వెతకసాగారు. యాధృచ్ఛికంగా అప్పుడే ఫారెస్టు పోలీసులు రాసాగారు. వాళ్ళను చూడడంతోటే తుపాకీ మోతలతో అడవి హోరెత్తిపోయింది. ఎదురు కాల్పులు జరుపుతూ నక్సలైట్లు అడవి లోపలికి పరుగెత్తసాగారు. ఆ శబ్దానికి బయటికి వచ్చిన పాముకటి, ఓ నక్సలైటుని ముద్దాడింది. అతడు గన్ వదిలేసి బాధతో పరుగెత్తాడు.

అప్పటికే మేనకేశ్వరరావ్ మెల్లిగా లేచి వెళ్ళి అక్కడ పడున్న గన్‌ను చేతిలోనికి తీసుకున్నాడు.

"హ్యాండ్సప్!" వినిపించిందో కంఠం కరుకుగా. గన్ వదిలేసి, చేతులు పైకెత్తి వెనుదిరిగాడు.

నలుగురు పోలీసులు అతడ్ని చుట్టుముట్టారు. "సార్ వీడ్ని ఎన్‌కౌంటర్ కింద వేసేద్దామా?" అడిగాడో పోలీసు

"వద్దులే! స్టేషన్‌కు తీసుకెళ్ళి వీళ్ళ స్థావరాల గురించి కక్కిద్దాం లేకలేక ఎన్నో రోజుల తర్వాత దొరికిన నక్సలైటును చంపుకుంటే ఎలా?" అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

పరిస్థితి ఏంటో మేనకేశ్వరరావ్‌కు అర్థమైంది. తనకిప్పుడు దేవుడు కనిపిస్తున్నాడు. ఏడుపు మొహంతో "అయ్యా! నేను నక్సలైట్‌ను కాదు. తపస్సు చేసుకోవటానికి వచ్చాను. ఈ డ్రస్ చూసైనా నమ్మండి" అన్నాడు.

"ఒరేయ్! మా దగ్గరా నీ టక్కు టమారాలు? ఛీ... నోర్మూయ్... చీరేస్తానేమనుకున్నావో..." అన్నాడు హెడ్. ఇంకో పోలీసు అతని గడ్డాన్ని లాగాడు. అది ఊడి చేతికొచ్చింది.

"ఏరా... తపస్సు చేసుకునేవాడివైతే ఈ పెట్టుడు గడ్డం దేనికి?


"దేవుడు త్వరగా ప్రత్యక్షమవుతాడనీ..." ఏడుస్తూ చెప్పాడు.

"దొంగ నాటకాలాడుతావా? చీరేస్తా... నడువు స్టేషన్‌కు" ఉరిమాడు హెడ్. ఇక తప్పదన్నట్లు వాళ్ళ వెంట నడిచాడు.

పోలీసు స్టేషన్‌లో అందరూ అతడ్ని వింతగా చూడసాగారు.

"ఏరా! నువ్వు నక్సలైట్‌వేనా? లేక సాధువు వేషంలో తిరుగుతూ అడవి జంతువుల్ని పట్టి అమ్ముకునే వాడివా?"

"అయ్యా! నా పేరు మేనకేశ్వరరావ్.



హైదరాబాద్‌లో ఉద్యోగిని. తపస్సు చేసి దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకుని వరాలు పొందాలని వచ్చాను. నేను నక్సలైటునూ కాదు, అడవి జంతువుల దొంగనూ కాదు" అన్నాడు ఏడుస్తూ.

"ఆగాగు! మా ఎస్సయ్‌గారు రానీ. ఒక్కొక్క కీలూ విరిచి, సాంబార్‌లో ఉడికించి నీకే తినిపిస్తారు. అప్పుడు కక్కుతావు, సాంబారుతో పాటుగా నిజాన్ని" అన్నాడు హెడ్.

ఎస్సై జీపు వచ్చింది. కానిస్టేబుళ్ళు సెల్యూట్ చేశారు.

"సార్! ఇంతకుముందు అడవిలో ఫైరింగ్ జరిగింది. ఒకడు దొరికాడు. కాకపోతే నక్సలైటో, అడవి జంతువుల దొంగో అర్థం కావడంలేదు. చూస్తే, సన్యాసి వేషంలో ఉన్నాడు. అడిగితే నిజం చెప్పడంలేదు" చెప్పాడు హెడ్.

"ఎముకలు కుళ్ళబొడిస్తే, వాడే నిజం చెప్తాడు" అన్నాడు ఎస్సై.

"సార్! తన పేరు మేనకేశ్వరరావనీ, హైదరాబాద్ వాడిననీ అంటున్నాడు".

ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా, "ఏంటీ? 'మేనకేశ్వరరావ్' అని చెప్పాడా?" త్వరగా అతణ్ని బయటకు తీసుకురండి. చూద్దాం!" అన్నాడు.

ఇంతవరకూ ఆ పేరు గల వాళ్ళు తనకు తెలిసి, తన మిత్రుడొకడున్నాడు. అతనూ హైదరాబాద్‌లోనే ఉండేది. ఇంతలో మేనకేశ్వరరావ్ బయటికి వచ్చాడు.

"ఒరేయ్! మేనకా' నువ్వట్రా?"

"వార్నీ.... ఏడుకొండలూ... నువ్వా... ఇక్కడ..."

"ఔను. నేనిక్కడ ఎస్సైని. ఏంట్రా ఈ అవతారం?" అన్నాడు ఎస్సై.

మేనకేశ్వరరావు జరిగినదంతా వివరించాడు. ఏడుకొండలుతో సహా అందరూ నవ్వారు.

"ఒరేయ్! శకుంతల ఎలా ఉందిరా?"

"ఆఁ...బానే ఉంది"

"పద పద ఇంటికెళ్దాం." అని ఇంటికి తీసుకెళ్ళాడు ఎస్సై. మేనకేశ్వరరావు అక్కడే రెండు రోజులు గడిపాడు.

మేనకేశ్వరరావ్‌ను హైదరాబాద్ బస్ ఎక్కించి "ఒరేయ్! ఈ కలియుగంలో దేవుడు ప్రత్యక్షమై వరాలిస్తాడనుకున్నావా? తపస్సంటే వేల సంవత్సరాలు చెయ్యాలి. ఇలాంటి తెలివి తక్కువ పని ఇంకోసారి చెయ్యకు. సమయానికి నేనున్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతే, నీ బాడీ ఇంత బాగా హైదరాబాద్ బస్ ఎక్కేదే కాదు. జాగ్రత్త!" అని హితోపదేశం చేశాడు ఏడుకొండలు.

"చాలా థ్యాంక్స్‌రా... థ్యాంక్స్...."

* * *

"చాలా థ్యాంక్స్... థ్యాంక్స్..."

"ఏమిటండీ! నిద్రలో ఏమిటా పలవరింతలు? బారెడు పొద్దెక్కింది. లేవండి" శకుంతల గొంతు విని లేచి కూర్చున్నాడు మేనకేశ్వరరావ్.

"అంటే... నేను తపస్సు... దొంగలు... నక్సలైట్లు... పోలీసులూ... ఏడుకొండలూ...."

"అబ్బా! ఏమిటండీ ఆ పిచ్చిమాటలు? ఏదైనా కల గన్నారేమో! లేవండి..." అంది.

ఒక్కసారి తల విదిలించి ఒళ్ళు విరుచుకుని లేచి ఇవతలికొచ్చాడు.

స్నానాదులు ముగించుకుని గుడికెళ్ళి ఓ అరగంట గడిపి ఇంటికొచ్చాడు.

"ఏమండీ! శుభవార్త. చెప్పుకోండి చూద్దాం" అంది శకుంతల ఆవిడ మొహం వెలిగిపోతోంది.

"ఏంటీ... మళ్ళీ నెలతప్పావా?" అన్నాడు నెమ్మదిగా.

"ఛీ... అదిప్పుడు శుభవార్తెలా అవుతుంది? ఇప్పటికే ముగ్గురున్నారుగా. ఇప్పుడు చెప్పండి..."

"ఊఁ... టమోటాలు, కిలో పది రూపాయలకే ఇస్తున్నారా?"

"అబ్బ! అస్సలు ఊహించలేరు. ఇలాంటి దద్దమ్మ నాకు భర్తగా దొరికాడు..."

"త్వరగా చెప్పవే ఏంటో...!"

"మీరింతకు ముందు అలా గుడికెళ్ళగానే మీ అటెండర్ నాగాంజనేయులు వచ్చాడు. మీకు బోనస్‌లు రేపు ఇస్తున్నారట. అదీగాక మీతో కలిపి మరో నలుగురికి ఇంక్రిమెంట్లు కూడా ఇచ్చారట!" చెప్పింది సంతోషంగా.

ఆవిడ కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. ఆవిడ చెప్పిన మాటలకు ఇప్పుడు నిజంగానే 'దేవుడు కనిపించాడు' మేనకేశ్వరరావ్‌కు. ✱

## ఇవి పాటిస్తే సరి....



- రిఫ్రిజిరేటర్ చెడు వాసన వస్తుంటే ఒక కప్పు నీటిలో టీస్పూన్ సోడియం బై కార్బోనేట్‌ని కొన్ని చుక్కల నిమ్మరసం వేసి దూదితో తుడిస్తే సమస్య పరిష్కార మవుతుంది.
- కేక్ మెత్తగా ఉండాలంటే బేక్ చేసిన తరువాత కొంచెం వేడిగా ఉన్నప్పుడే కేక్‌పై పంచదార నీళ్ళు చల్లితే సరి.
- ఊలు దుస్తులపై పడిన నూనె మరకలను తొలగించాలంటే, మరక ఉన్న చోట కాస్తంత పెరుగు పోసి రుద్ది కొంచెం సేపు అయిన తరువాత ఉతకాలి.
- బాగా మురికిపట్టిన బాటిల్స్‌ను శుభ్రం చెయ్యడానికి బాటిల్‌లో నీళ్ళుపోసి బియ్యపు గింజలను వేసి కొద్ది నిమిషాలు కదిలించి కడగాలి.
- నెయ్యి ఎక్కువ కాలం తాజాగా ఉండటానికి నిమ్మకాయంత బెల్లపు ఉండను నెయ్యి డబ్బాలో వేసి ఉంచితే ఫలితం ఉంటుంది.
- అరటిపండు తొక్కను పారేయకుండా గులాబి మొక్కల్లో వేసినట్లయితే అరటిపండు తొక్కలో ఉండే ఫాస్ఫరస్, పొటాషియం వల్ల మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
- చేపలు ఉడకబెట్టినప్పుడు ఆ వాసన ఇల్లంతా వ్యాపిస్తుంది. అలా వ్యాపించకుండా ఉండకూడదనుకుంటే ఉడికించిన బాణలిలో కాసిన్ని పొదీనా ఆకులు వేస్తే ప్రయోజనం ఉంటుంది.
- బియ్యప్పిండి, శెనగపిండి నిలవ ఉంచిన డబ్బాల్లో బిర్యానీ ఆకు వేస్తే తేమ చేరకుండా ఉంటుంది.
- ఆహారపదార్థాల్లో కొన్ని వెల్లుల్లి రేకులు వేసినట్లయితే పురుగులు చేరవు.
- లెదర్ ఐటమ్స్ తళతళా మెరవాలంటే ఆవనూనెలో దూది ముంచి శుభ్రపరచాలి. **- భారతి**